
కాటారం : క్యూలో నిలబడిన జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి


మహాముత్తారం : యామన్‌పల్లిలో ఓటర్లకు నమస్కరిస్తున్న పుట్ట మధూకర్

# ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికలు

- కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ, అబ్జర్వర్

కాటారం, నవంబర్ 30 : మండలంలో శాసనసభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో సమయానికే ఈవీఎంలను పోలింగ్ అధికారులు సిద్ధం చేశారు. మండలంలో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ముగియగా కాటారం, గారెపల్లి, దామెరకుంట, గంగారం తదితర గ్రామాల్లో ఓటర్లు ఎక్కువగా వచ్చి ఉండడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో సమయం మించి పోలింగ్ జరిగింది. కాటారంతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ కిరణ్ ఖరే, జనరల్ అబ్జర్వర్ శ్రీధర్ పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు మండల కేంద్రంలోని పోలింగ్‌ను పరిశీలించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామం ధన్వాడలో ఓటేసి పలు కేంద్రాలను సందర్శించారు. డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్, సురేశ్, సీఆర్పీఎఫ్ జవాన్లు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

### మహాముత్తారంలో..

మహాముత్తారం : మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచి ఓటర్లు క్యూలో ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైద్య సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. మహాముత్తారం, యామన్‌పల్లి, ములుగుపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ పరిశీలించారు.

### అన్నారంలో మొరాయించిన ఈవీఎంలు..

#### పలుగులలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో సాయంత్రం 4 గం.ల వరకు 70 శాతం ఓటింగ్ నమోదైంది. అన్నారం గ్రామంలో ఈవీఎంలు మొరాయించాయి. ఒక్కో ఓటరు 20 నిమిషాల సమయం పట్టింది. ఎస్సై లక్ష్మణ్‌రావు బందోబస్తు నిర్వహించారు. ఇతర ప్రాంతాల ఉన్న విద్యార్థులు, ఉద్యోగస్తులు ఒకరోజు ముందే స్వగ్రామాలకు చేరుకున్నారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత ఆనందం వ్యక్తం చేశారు. పలుగులలో రెండు పార్టీల నాయకులు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాల వారిని అక్కడినుంచి పంపించారు.

### కట్టుదిట్టమైన భద్రత

మహదేవపూర్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. నూతనంగా ఓటు వచ్చిన యువత ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేశారు. దివ్యాంగులను వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మండలంలో 24,589 ఓట్లకు 20,969 ఓట్లు పోలయ్యాయి. 85.28 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ లక్ష్మి రాజయ్య తెలిపారు. పోలింగ్ తీరును ఎన్నికల స్టేట్ అబ్జర్వర్ శ్రీధర్, ఏఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పరిశీలించారు. పోలింగ్‌ను బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ పరిశీలించారు.



కాళేశ్వరంలో క్యూలో నిల్చున్న ప్రజలు


మల్హర్ : తాడిచర్లలో బారులు తీరిన ఓటర్లు


మహదేవపూర్‌లో..

## నేడు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రత్యేక సమావేశం

**డీఎంహెచ్‌వో చల్లా మధుసూదన్**

కృష్ణకాలనీ, నవంబర్ 30 : ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో నేడు (శుక్రవారం) హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో చల్లా మధుసూదన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రోగ్రాం సంబంధిత శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

## ఒకరిపై కేసు నమోదు

చిట్యాల, నవంబర్ 30 : ఓటు వేస్తూ ఫోన్‌తో వీడియో తీసి వాట్సప్‌లో స్టేటస్ పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జంగిలి రమేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని దూత్‌పల్లి గ్రామానికి చెందిన ఎండీ జావెద్ 116పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అనంతరం తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు అదే గ్రామానికి చెందిన రాజేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# జిల్లాలో సాఫీగా శాసనసభ పోలింగ్


ఓటర్లతో మాట్లాడుతున్న భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

**భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**

భూపాలపల్లి రూరల్, నవంబర్ 30 : భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి ఎన్నికల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీస్ బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షించాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట భూపాలపల్లి పోలీస్ అధికారులు ఉన్నారు.


ఓటు వేసిన అనంతరం గ్రామస్తులతో నాగజ్యోతి

## కాల్వపల్లిలో ఓటు వేసిన నాగజ్యోతి

తాడ్వాయి, నవంబర్ 30 : బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి గురువారం తన స్వగ్రామం కాల్వపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ గ్రామం నుంచి ఎమ్మెల్యేగా టికెట్ పొందినందుకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామంటూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. ఆలాగే మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ తీరును పరిశీలించారు.


క్యూలో నిలబడిన కలెక్టర్ భవేశ్‌మిశ్రా

## పుల్లూరి రామచంద్రపురంలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా..

భూపాలపల్లి రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో గురువారం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా ఓటేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పుల్లూరి రామయ్యపల్లి ప్రాథమిక పాఠశాల 79వ పోలింగ్ స్టేషన్‌లో క్యూలో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు.


పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝా, కలెక్టర్ ఇలా త్రిపాఠి

## వెబ్ కాస్ట్‌లో ఓటింగ్ పరిశీలన

ములుగు టౌన్, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ములుగు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలోని ఓటింగ్‌ను గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝా, ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఈడీఎం దేవేందర్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం

ఏటూరునాగారం, నవంబర్ 30 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ వృద్ధురాలిని బీఆర్ఎస్ నాయకుడికి చెందిన వాహనంలో తీసుకువచ్చారు. వాహనం గేటు దాటి వెళ్లే క్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సీతక్కనే గెలుస్తుందంటూ నినాదాలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లక్ష్మణ్ బాబు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ వారు కూడా నినాదాలు చేయడంతో తోపులాటకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పోలీసులు గేట్లు బంద్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు గొడవ సద్దు మణిగేందుకు ప్రయత్నించారు. కొద్ది సేపటికి మళ్లీ గొడవ చెలరేగడంతో సీఐ రాజు, సీఆర్పీఎఫ్ పోలీసులు అందరిని చెదరగొట్టారు.

## మల్హర్‌లో 84.18 శాతం పోలింగ్

మల్హార్, నవంబర్ 30 : మండలంలో 84.18 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 21,893 ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు(10770), మహిళలు(11123) కాగా గురువారం జరిగిన పోలింగ్‌లో 18,431 పాల్గొన్నారు. దీనిలో పురుషులు(9101), మహిళలు(9330) తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని మల్లారంలోని 252 పోలింగ్ బూత్‌లో ఈవీఎం 30 నిమిషాల పాటు మొరాయించడంతో ఓటర్ల ఇబ్బంది పడ్డారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ బూత్‌కు చేరుకొని ఓటేశారు.